'ఓవర్సీస్' విడుదల బాధ్యత అధికారులదే

- ఇంటిగ్రేటెడ్ గురుకులాల డిజైన్లు పూర్తి చేయండి
- 5వేల కోట్లతో 120 గురుకులాలు: భట్టి

హైదరాబాద్, ఆగస్టు19 (నమస్తే తెలంగాణ): ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయించుకునే బాధ్యత సంబంధిత అధికారులదేనని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణానికి స్థలసేకరణ, డిజైన్లను సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో పరిస్థితులపై ఉన్నతాధికారులతో సచివాలయంలో సోమవారం ప్రత్యేక సమీక్షా సమావేశం సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ స్కూల్ భవనాల నిర్మాణాలకు కావాల్సిన స్థలాన్ని కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వేగవంతంగా సేకరించాలని, డిజైన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రూ.5వేల కోట్లతో 30 కాంప్లెక్స్‌ల్లో 120 గురుకుల పాఠశాల భవనాల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 8నెలల్లో భవనాలను పూర్తి చేయాలని ఆదేశించారు. గురుకులాల్లో 100శాతం అడ్మిషన్లు పూర్తి చేయాలని కోరారు. 1029 గురుకుల పాఠశాలల్లో ఇప్పటి వరకు మంచాలు, బెడ్స్, బెడ్‌షీట్స్ ఎన్ని ఉన్నాయి? ఇంకా ఎంత మందికి కావాలి? అనే జాబితాను తయారు చేసి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించిన తర్వాత అక్కడ తీసుకున్న చర్యలపై గురుకులాల సెక్రటరీ రమణకుమార్‌ను డిప్యూటీ సీఎం ఆరా తీశారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రెండో విడత నిధుల జాబితాను అందజేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సమీక్షలో ఆర్థికశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణభాస్కర్, అలుగు వర్షిణి, శరత్ పాల్గొన్నారు.

భట్టికి విద్యుత్తు ఉద్యోగుల సన్మానం

దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో పదోన్నతులు పొందిన అధికారులు, ఉద్యోగులు సోమవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి సన్మానించారు. ఉద్యోగ సంఘాల నేతలు శివాజీ, అంజయ్య, వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. పవర్ జేఏసీ ఆధ్వర్యంలో భట్టి విక్రమార్కను కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, కో కన్వీనర్ బీసీరెడ్డి, వేణు, భూపాల్‌రెడ్డి, అనిల్, సదానందం, పీవీరావు, వెంకటనారాయణరెడ్డి, అంజయ్య, కిరణ్‌కుమార్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పురోగతి లేని ఆయిల్‌పామ్ కంపెనీలపై చర్యలు

- ఇతర రాష్ట్రాలకు గెలలు తరలింపును అనుమతించం
- ఆయిల్‌పామ్ సాగుపై సమీక్షలో మంత్రి హెచ్చరిక

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు పురోగతి చూపెట్టని ఆయిల్ కంపెనీల మీద ప్రత్యక్ష చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. సచివాలయంలో సోమవారం ఆయిల్‌పామ్ సాగు పథకం అమలుపై రాష్ట్రంలో పనిచేస్తున్న 14 కంపెనీల నిర్వాహకులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లాలవారీగా సాగు విస్తీర్ణంతోపాటు కంపెనీలవారీగా పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు లక్ష్యాలను చేరుకోలేని, ఏ మాత్రం పురోగతి చూపని కంపెనీ నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. పురోగతి చూపెట్టని కంపెనీల మీద ప్రత్యక్ష చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణలో ఉత్పత్తి చేస్తూ వేరే రాష్ట్రాలకు ఆయిల్‌పామ్ గెలలను తరలించడాన్ని అనుమతించబోమని స్పష్టంచేశారు. ఆయా కంపెనీలు వెంటనే ఇక్కడ ఫ్యాక్టరీలు నిర్మించి, ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ మొదలు పెట్టాలని ఆదేశించారు. కచ్చితమైన ప్రణాళిక లేకుండా, తెలంగాణ రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా కంపెనీలు ప్రవర్తిస్తే సహించబోమని మంత్రి హెచ్చరించారు. ఫ్యాక్టరీ పూర్తయ్యేనాటికి దాని పరిధిలో కనీసం 10వేల ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు, ఉద్యాన సంచాలకులు, మేనేజింగ్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఉద్యానశాఖ అధికారులు, ఆయిల్‌పామ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సులో పురుడు పోసిన కండక్టర్

- భారతికి ఎండీ సజ్జనార్ అభినందనలు

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ మహిళా కండక్టర్ బస్సులో గర్భిణికి పురుడుపోసి మానవత్వం చాటుకున్నది. సోమవారం రాఖీ పండుగ సందర్భంగా గద్వాలకు చెందిన నిండు గర్భిణి సంధ్య సోదరులకు రాఖీ కట్టేందుకు వనపర్తికి వెళ్లేందుకు పల్లెవెలుగు బస్సు ఎక్కింది. బస్సు నాచహళ్లికి చేరగానే ఆమెకు పురిటినొప్పులు మొదలయ్యాయి. అప్రమత్తమైన మహిళా కండక్టర్ జీ భారతి బస్సును ఆపించింది. అదే బస్సులో ప్రయాణిస్తున్న ఓ నర్సు సాయంతో గర్భిణికి పురుడుపోశారు. పండంటి ఆడబిడ్డ జన్మించింది. అనంతరం 108సాయంతో తల్లీబిడ్డలను స్థానిక దవాఖానకు తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. విధుల్లో ఉండి సాటి మహిళకు పురుడుపోసి మానవత్వం చాటిన కండక్టర్‌కు టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. 'శభాష్ భారతి' అంటూ ఆయన పోస్ట్ చేసిన ట్వీట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

- సోదరుడి విగ్రహానికి రాఖీ కట్టిన అక్కలు

వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడ గ్రామంలో సోదరుడి విగ్రహానికి అక్కలు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. బోనగిరి సారయ్య-ఐలమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమారు డు హరిప్రసాద్ మూడేండ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుమారుడి జ్ఞాపకార్థం తల్లిదండ్రులు విగ్రహం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అక్కలు శిలిష, ప్రవళిక రాఖీలు కడుతున్నారు.

-చెన్నారావుపేట

కరెంట్ పోతది.. ఇన్వర్టర్ కొనుక్కోండి!

- వినియోగదారుడికి ఏడీఈ ఉచిత సలహా
- తరచూ కోతలపై ఎల్లారెడ్డిగూడ వాసి ఫోన్
- రోజంతా నరకం చూపిస్తున్నారని ఆవేదన
- అధికారి నిర్లక్ష్యపు సమాధానంపై అసహనం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): నిమిషం కూడా కోతలు లేకుండా కరెంట్ సరఫరా చేస్తున్నామని సాక్షాత్తూ విద్యుత్తు శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి డబ్బా కొడుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. విద్యుత్తు సరఫరా విషయంలో ఆ శాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కరెంటు సమస్య కోతలతో ఇబ్బంది పడుతున్నామని ఓ వినియోగదారుడు ఏడీఈ (అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్)కి ఫోన్ చేస్తే 'కరెంటు ఇట్లనే పోతది.. ఇన్వర్టర్ కొనుక్కోండి' అంటూ ఉచిత సలహా ఇవ్వడంతో నివ్వెరపోయాడు. అమీర్‌పేట పరిసర ప్రాంతమైన ఎల్లారెడ్డిగూడకు చెందిన ఓ విద్యుత్తు వినియోగదారుడు (ప్రొఫెసర్) తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌తో పాటు తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో కలిగిన విద్యుత్తు అంతరాయాలపై మాట్లాడుతూ 'నేను ఎల్లారెడ్డిగూడ జేపీనగర్‌లోని కీర్తి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటాను. మా అపార్ట్‌మెంట్‌తో పాటు చుక్కల ప్రాంతాల్లో తరచూ కరెంటు పోతున్నది. కరెంట్ కోతలతో నరకం చూపిస్తున్నారు. ఈ విషయంలో చాలాసార్లు విద్యుత్తు అధికారులతో మాట్లాడిన. నిన్న చాలా సార్లు పోయింది, ఈ వాళ మధ్యాహ్నం కూడా ఎక్కువ సేపు పోయింది. ఇప్పుడు కూడా కరెంటు లేదు. నిన్న పొద్దున ఏడీఈతో మాట్లాడితే కరెంటు ఇట్లనే పోతది.. ఇన్వర్టర్ కొనుక్కోండి సార్ అని చెప్పిండు. ఇన్వర్టర్, జనరేటర్ పెట్టుకునేట్టు ఉంటే మీకెందుకు కరెంటు బిల్లులు కట్టాలి? అని అడిగితే దానికి ఆయన రకరకాల సమాధానం చెప్పారు. సమస్యలో తమ ప్రమేయమే లేదని తప్పించుకున్నారు. మళ్లీ సోమవారం ఉదయం కరెంట్ పోతే ఆపరేటర్‌కు ఫోన్ చేసిన. కేబుల్ కట్ అయిందని చెప్పాడు. మొన్ననే బాగు చేసినం.. మళ్లీ పోయిందన్నాడు. కొద్ది రోజులకే ఎట్లా పోయిందని అడిగితే అది కాంట్రాక్టర్‌కు తెలుసు అని చెప్పాడు. ఇక నాకర్థమైందేంటంటే ఎవరికి వారు తప్పించుకునేందుకు ఒకరిపై ఒకరు తోసుకుంటున్నారే తప్ప, సమస్య పరిష్కారానికి మాత్రం కృషి చేస్తలేరు' అని తనకు కలిగిన అసౌకర్యాన్ని 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు.

అంధకారంలో కేఎంసీ హాస్పిటల్

- మూడు గంటలు కరెంట్ లేక రోగుల అవస్థలు
- జనరేటర్‌కు ఇంధనం కూడా దిక్కులేని వైనం

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 19 : వరంగల్‌లోని కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తీరు పేరుగొప్ప.. ఊరు దిబ్బ అన్నచందంగా తయారైంది. మౌలిక వసతుల విషయంలో అధ్వాన పరిస్థితి నెలకొన్నది. సోమవారం కురిసిన వర్షానికి హాస్పిటల్‌కు 3గంటల పాటు విద్యుత్తు అంతరాయం ఏర్పడి పూర్తిగా అంధకారంగా మారింది. వెంటనే సిబ్బంది చర్యలు చేపట్టకపోవడంతో రోగులు, అటెండెంట్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన జనరేటర్‌కు ఇంధనం అందుబాటులో లేకపోవడంతో అది పనిచేయక వైద్యసేవలకు సైతం అంతరాయం కలిగింది. ఇకనైనా అధికారులు మౌలిక వసతులు మెరుగుపరచడంపై దృష్టిపెట్టాలని రోగులు, అటెండెంట్లు కోరుతున్నారు.

విద్యుత్ అంతరాయం కారణంగా అంధకారంలో ఉన్న వార్డులు

'ట్రిపుల్ ఆర్' భూములకు మంచి ధరలు

ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 19(నమస్తే తెలంగాణ) : రీజినల్ రింగు రోడ్డు(ట్రిపుల్ ఆర్)నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు మంచి ధరలు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్టు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రైతులు అధైర్యపడకుండా భూసేకరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో వివిధ ప్రాజెక్టుల పురోగతిపై సోమవారం సచివాలయంలో మంత్రి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగానికి కావాల్సిన 1,941.65 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయినట్టు చెప్పారు. రోడ్డు నిర్మాణంలో ప్రభావితమవుతున్న అటవీభూములకు ప్రత్యామ్నాయంగా మహబూబాబాద్ జిల్లాలో 73.04 హెక్టార్ల భూమిని అటవీశాఖకు కేటాయించినట్టు తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణంలో వేగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్-65ని 6 లేన్లుగా విస్తరించేందుకు డీపీఆర్ రూపకల్పనకు ఇప్పటికే టెండర్లు పిలిచినట్టు, త్వరలోనే కన్సల్టెంట్‌ను నియమించనున్నట్టు వెల్లడించారు. నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయినందున అపాయింటెడ్ డేట్ వచ్చేలోగా పెండింగ్ భూసేకరణ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

'అల్లుడా మజాకా'పై ఇంటెలిజెన్స్ ఆరా!

- ఉలిక్కిపడ్డ వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు
- ఎవరా మంత్రి? ఎవరా అల్లుడు? అని చర్చ

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ఆయిల్‌పామ్ కంపెనీలకు సంబంధించి 'అల్లుడా మజాకా' పేరిట 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం వ్యవసాయశాఖలో సోమవారం కలకలం రేపింది. ప్రభుత్వ పెద్దలు, శాఖలోని పలువురు ఉన్నతాధికారులు సైతం ఉలిక్కిపడ్డారు. ప్రీ యూనిక్ ఇండియా ఆయిల్‌పామ్ కంపెనీ హస్తగతానికి ఓ మంత్రి అల్లుడు, కొడుకు స్కెచ్ వేస్తున్నారు. దాన్ని విక్రయించాలని ఓనర్లను బెదిరింపులకు గురిచేస్తూ ఒత్తిడి చేస్తున్నారు. రూ.కోట్లలో పెట్టబడి ఇంతకాలం నిర్వహించిన కంపెనీని పంటచేతికొచ్చే సమయానికి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఇదే విషయమై 'అల్లుడా మజాకా' పేరిట నమస్తే తెలంగాణలో సోమవారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో అటు ప్రభుత్వవర్గాలు, ఇటు వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు సైతం ఉలిక్కిపడ్డట్టు తెలుస్తున్నది. ఎవరా మంత్రి? ఎవరా అల్లుడు? అని జోరుగా చర్చ కొనసాగుతున్నది. మరోవైపు ఆ కథనంపై ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా ఆరా తీసినట్టు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా మంత్రి తుమ్మల ఆయిల్‌పామ్ కంపెనీలపై సోమవారం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించటం గమనార్హం. ఆ సమావేశంలోనూ 'నమస్తే తెలంగాణ' కథనంపై అంతర్గతంగా చర్చించుకున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం.

ఆర్వోకు నామినేషన్ పత్రం అందజేస్తున్న సింఘ్వీ, సీఎం రేవంత్

కాంగ్రెస్ అభ్యర్థిగా సింఘ్వి నామినేషన్

హైదరాబాద్, ఆగస్టు19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ నుంచి రాజ్యసభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున అభిషేక్ మను సింఘ్వి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. తొమ్మిది రాష్ట్రాలలో 12 రాజ్యసభ స్థానాలకు సెప్టెంబర్ 3న ఉపఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో కే కేశవరావు రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని అధిష్ఠానం ప్రకటించింది. పార్టీ ముఖ్య నేతలతో కలిసి అసెంబ్లీకి చేరుకున్న సింఘ్వీ రిటర్నింగ్ అధికారికి నాలుగు సెట్ల నామినేషన్‌ను సమర్పించారు. ఆయనవెంట సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పలువురు ఎమ్మెల్యేలు తదితరులు ఉన్నారు.

ఏపీ వ్యక్తి తెలంగాణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడా?

- తక్షణమే తొలగించాలంటూ అధిష్ఠానాకి విద్యార్థుల లేఖాస్త్రం

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆంధ్రాప్రాంతానికి చెందిన వ్యక్తిని నియమించడం కాంగ్రెస్‌లో నిప్పురాజేసింది. ఆంధ్రా వలసవాదులు వద్దు.. తెలంగాణ విద్యార్థులు ముద్దు.. మా పదవులు మాకే కావాలి అంటూ కాంగ్రెస్ శ్రేణులు అధిష్ఠానం నిర్ణయాన్ని ధిక్కరించాయి. రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఈ నెల 13న ఏపీకి చెందిన యడపల్లి వెంకటస్వామిని ఏఐసీసీ నియమించింది. దీనిపై తెలంగాణ విద్యార్థి నేతలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అధిష్ఠానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ లేఖాస్త్రాన్ని సంధించారు. వెంకటస్వామిని తొలగించాలని, తెలంగాణ వ్యక్తికే అధ్యక్షపదవిని కట్టబెట్టాలని డిమండ్ చేశారు. 1200 మంది విద్యార్థుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా మళ్లీ ఆంధ్రా వలసవాదిని నియమించడం తెలంగాణ సమాజాన్ని అవమానించడమే' అని వారు ఆ లేఖలో పేర్కొన్నారు.

ఇసుక తోడివేతకు ఈపీసీ విధానం

- అప్పుడే పనులు త్వరగా పూర్తి
- గ్లోబల్ టెండర్లు పిలవండి
- జలాశయాల్లో ఇసుక, మట్టి నిల్వలను అంచనా వేయండి
- క్యాబినెట్ సబ్‌కమిటీ ఆదేశం
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు19 (నమస్తే తెలంగాణ): జలాశయాల్లో పూడికతీత పనులను ఈపీసీ విధానంలో చేపట్టాలని, అప్పుడే నిర్దేశిత సమయంలో పూర్తవుతాయని అధికారులకు మంత్రి వర్గ ఉపసంఘం చైర్మన్, సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గ్లోబల్ టెండర్లు ఆహ్వానించి పనులు అప్పగించాలని సూచించారు. రాష్ట్రంలోని జలాశయాల్లో పూడికతీతకు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం వేసిన విషయం తెలిసింది. ఈ కమిటీ ఇప్పటికే సమావేశమై ప్రాథమిక నివేదిక అందించాలని అధికారులకు సూచించగా, ఆ మేరకు వివరాలు అందించారు. తాజాగా నివేదికపై రాష్ట్ర నీటి పారుదల, రెవెన్యూ, ఖనిజాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సచివాలయంలో సోమవారం క్యాబినెట్ సబ్‌కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సభ్యులు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. చైర్మన్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో కాంట్రాక్టర్లను ఆహ్వానించి గ్లోబల్ టెండర్లు పిలిచి పనులు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. జలాశయాల్లో ఉన్న ఇసుక, మట్టి నిల్వలను ఖనిజాభివృద్ధి సంస్థ అంచనా వేయాలని సూచించారు. ఇసుక, మట్టి ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయంతో రిజర్వాయర్ల నిర్వహణ చేపట్టాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అన్ని జలాశయాలలో పూడికతీత పనులు చేపట్టి వేగంగా పూర్తిచేయాలని, ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా చూడాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేసి జలాశయాల్లో నీటి నిల్వలు పెరిగేలా కృషి చేయాలని, వాటిని పటిష్టంగా మార్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏజెన్సీలో ఒకే సమయంలో ఎక్కువ పనులు చేపట్టేలా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

హైపవర్, టెక్నికల్ కమిటీల ఏర్పాటు

పూడికతీతకు సంబంధించి హైపవర్, టెక్నికల్ కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఖనిజాభివృద్ధి సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి, ఫిషరీస్ తదితర డిపార్ట్‌మెంట్ల నిపుణులతో హైపవర్ కమిటీ వేయాలని సూచించింది. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో హైడ్రాలజీ, డ్యామ్ సేఫ్టీ, డిజైన్స్ నిపుణులతో టెక్నికల్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఫొటోజర్నలిస్టులతో ఫొటోకు జీవం: పొంగులేటి
- ఘనంగా అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం

మంత్రి పొంగులేటి నుంచి అవార్డులు అందుకుంటున్న 'నమస్తే తెలంగాణ' ఫొటోగ్రాఫర్లు సైదిరెడ్డి, బందగి గోపి, మెరుగు ప్రతాప్

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ఫొటో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో 8 నెలలుగా అభయహస్తం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి నేటి ఫొటోగ్రఫీ ప్రదర్శన నిదర్శనమని చెప్పారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్ర సమాచార- పౌర సంబంధాలశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన వేర్వేరు వేడుకల్లో ఆయన పాల్గొని, ఫొటోగ్రఫీ ప్రదర్శనను ప్రారంభించారు. అభయహస్తం హామీలపై నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలకు వచ్చిన ఎంట్రీలను ప్రదర్శించారు. 5 క్యాటగిరీలలో జ్యూరీ సభ్యులు ఎంపిక చేసిన ఫొటోగ్రాఫర్లుకు మెమెంటో, నగదు పురస్కారాలు అందజేసి, అభినందించారు. ఫొటోతో కూడిన వార్తకు పరిపూర్ణత చేకూరుతుందని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి చెప్పారు.

'నమస్తే' ఫొటోజర్నలిస్టులకు అవార్డులు

నమస్తే తెలంగాణ ఫొటోజర్నలిస్టులు పలు అవార్డులు దక్కించుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విభాగంలో గృహజ్యోతి పథకం చిత్రానికి పీ సైదిరెడ్డి (సూర్యాపేట) ప్రథమ బహుమతి, రూ.20వేల నగదు, ఉత్తమ వార్త చిత్రానికి బందిగే గోపి(మహబూబ్‌నగర్) కన్సోలేషన్ బహుమతి, గృహాజ్యోతి పథకానికి మెరుగు ప్రతాప్(వరంగల్) కన్సోలేషన్ బహుమతి, రూ.5వేల నగదు దక్కించుకున్నారు. మంత్రి పొంగులేటి వారిని సత్కరించారు. అదనపు పీఆర్‌వో చింతల శ్రీనివాస్, ఏవీఎస్ అధికారులు నాగరాజశర్మ, ప్రసాద్, లక్ష్మీనారాయణకు అవార్డులు దక్కాయి.

వైద్య సిబ్బందికి ప్రతి నెలా వేతనాలు

- మంకీ పాక్స్‌పై అప్రమత్తంగా ఉండండి
- వైద్యారోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సోమవారం ఆయన సచివాలయంలో టీవీవీపీ, డీపీహెచ్ పరిధిలోని దవాఖానల్లో మౌలిక సదుపాయాలు, వైద్యసేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దవాఖానల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అదనపు సేవలైన సెక్యూరిటీ, శానిటేషన్, డైట్, లాండ్రీ సేవలు అందించడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంకీ పాక్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదన్నారు. గాంధీ, ఫీవర్ దవాఖానల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేయాలని సూచించారు.

వైద్య సిబ్బందికి భద్రత కల్పిస్తాం..

ప్రభుత్వ దవాఖానలు, మెడికల్ కాలేజీల్లో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బందికి భద్రత కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జూడా ప్రతినిధులు డాక్టర్ కొమ్ము రాహుల్, జే ఐజాక్‌న్యూటన్, శ్రీనాథ్, సందీప్‌అరోలా, సందీప్‌చారి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా కొత్త భూచట్టం

- మంత్రి పొంగులేటి వెల్లడి
- ట్రెసా ఆధ్వర్యంలో చర్చావేదిక

హైదరాబాద్, ఆగస్ట్ 19 (నమస్తే తెలంగాణ): రైతులు ఎదుర్కొంటున్న అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించేలా నూతన రెవెన్యూ చట్టానికి రూపకల్పన చేస్తామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టంచేశారు. నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ ద్వారా రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొత్త చట్టం వీటికి పరిష్కారం చూపుతుందని అన్నారు. ప్రతి గ్రామానికి కనీసం ఒక రెవెన్యూ ఉద్యోగిని నియమించి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఇతర శాఖలకు బదలాయించిన వీఆర్వోలను, వీఆర్ఏలను రెవెన్యూలోకి తీసుకోవాలనే అంశంపై చర్చిస్తున్నామని తెలిపారు. ధరణి కమిటీ సభ్యుడు, భూచట్టాల నిపుణుడు భూమి సునీల్ మాట్లాడుతూ.. నూతన రెవెన్యూ చట్టంలో పొందుపరచిన అంశాలను వాటి ప్రత్యేకతలను రైతులకు, పట్టేదార్లకు చేకూరే ప్రయోజనాలను వివరించారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు కే చంద్రమోహన్ తదితరులు మాట్లాడారు.

ధర్నాలతో దద్దరిల్లిన తెలంగాణ

నల్లగొండ జిల్లా మండల కేంద్రంలో చివరి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని అఖిలపక్ష పార్టీల ఆధ్